క్లుప్తంగా

వైభవంగా సప్తాహ మహోత్సవాలు

పెదపూడి: జి.మామిడాడలో ప్రసిద్ధి చెందిన శ్రీసూర్యనారాయణమూర్తి స్వామి వారి ఆలయంలో 11వ వార్షికోత్సవ సప్తాహ మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం తెల్లవారుజామున 3 గంటలకు నగర సంకీర్తన, 4 గంటలకు కలశస్థాపన, అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. స్థానిక బాలబాలాజీ భజన భక్త మండలి సభ్యులు భక్తి గీతాలు ఆలపించి భజనలు చేశారు.

కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

పెదపూడి: ఈ నెల 11 నుంచి నవంబర్ 11 వరకూ నిర్వహించే 'ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి' కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు, ప్రజా ప్రతినిధులు జయప్రదం చేయాలని పార్టీ మండల కన్వీనర్ గుత్తుల వెంకటరమణ పిలుపునిచ్చారు. పెదపూడిలో ఆదివారం నిర్వహించిన పార్టీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామ కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు అందరూ కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. ప్రతి గ్రామంలో తప్పనిసరిగా పార్టీ జెండాను ఆవిష్కరించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి అందరూ శక్తి వంచన లేకుండా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ కర్రి శ్రీవెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపటిలోగా ఈ-కేవైసీ నమోదు చేసుకోవాలి

గోకవరం: మండలంలోని రైతులు ఈ నెల 10వ తేదీలోగా ఈ-కేవైసీ నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి కె.రాజరాజేశ్వరి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలో ఇంకా 600 ఎకరాల్లో రైతులు ఈ-కేవైసీ నమోదు చేసుకోలేదన్నారు. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలంటే కచ్చితంగా ఈ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉందన్నారు. మండలంలో ముఖ్యంగా మల్లవరం, అచ్యుతాపురం, తంటికొండ, కామరాజుపేట, కృష్ణునిపాలెం గ్రామాల్లో రైతులు ఈ-కేవైసీ నమోదు చేసుకోలేదన్నారు. ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు చొరవ తీసుకుని రైతులతో ఈ-కేవైసీ నమోదు చేయించాలని కోరారు.

కొనసాగుతున్న పూడికతీత పనులు

మధురపూడి: మెట్ట ప్రాంతంలోని పంటలకు సాగునీరందించేందుకు చేపట్టిన పంట కాలువ పూడికతీత పనులు కొనసాగుతున్నాయి. మురారి కెనాల్ శివారు గ్రామాలైన బుచ్చెంపేట, గుమ్ములూరు, బూరుగుపూడి, దోసకాయలపల్లి గ్రామాల్లో పంట కాలువ పూడికతీత పనులు ఆదివారం కూడా జరిగాయి. మొదటి దశలో 15 కిలోమీటర్లు పూడిక తీశారు. అయితే మెట్ట గ్రామాలకు సక్రమంగా నీటి సరఫరా కాకపోవడంతో రెండో పర్యాయం 10 కిలో మీటర్లు పనులు చేస్తున్నారు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సొంత నిధులతో ఈ పనులు చేయిస్తున్నారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పారదర్శకంగా ధాన్యం కొనుగోలు


రాజానగరం: ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ నియమ, నిబంధనలను అనుసరించి పారదర్శకంగా కొనుగోలు చేసేందుకు అవసరమైన కార్యాచరణను రూపొందించామని మండల వ్యవసాయాధికారి ఇమామి ఖాసిమ్ అన్నారు. మండలంలోని నామవరం ఆర్బీకేలో మండల ప్రత్యేకాధికారి వీణాదేవి అధ్యక్షతన నిర్వహించిన మైత్రి కమిటీ సమావేశంలో ధాన్యం కొనుగోలుకు సంబంధించిన వివరాలను తెలియజేశారు. దళారుల ప్రమేయం లేకుండా రైతులు తాము పండించిన పంటకు తగిన గిట్టుబాటు ధర వచ్చేందుకు ఆర్బీకేల ద్వారా విక్రయించడమే శ్రేయస్కరమన్నారు.

దారి కాచి డబ్బులు దోచుకున్న దుండగులు!

కడియం: వేమగిరి వద్ద రాత్రి 2 గంటల సమయంలో మోటారుసైకిల్‌పై వస్తున్న ఇద్దరు యువకులను అటకాయించి, వారి వద్ద నున్న రూ.4,500 నగదు దోచుకున్న ఘటన చోటు చేసుకుంది. కడియం పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం వానపల్లి గ్రామానికి చెందిన నాగాబత్తుల దుర్గాప్రసాద్, స్నేహితుడు హేమసాయితో కలిసి ఈనెల 7వ తేదీన వైజాగ్‌లో పరీక్ష రాసేందుకు వెళ్లారు. 8వ తేదీ తెల్లవారు జామున 2 గంటల సమయంలో రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్ వద్ద ఉంచిన తమ మోటారుసైకిల్‌పై తిరిగి ఇంటికి బయలుదేరారు. వీరిద్దరూ వేమగిరి చేరుకునే సరికి మోటారు సైకిల్‌పై ఎదురుగా వచ్చిన ఇద్దరు వ్యక్తులు వీరిని అటకాయించారు. నగదు ఇవ్వకపోతే చంపేస్తామని బెదిరించారు. దీంతో భయపడి ఇద్దరి వద్దా ఉన్నా రూ.4,500 నగదును దుండగులకు ఇచ్చేశారు. ఆ డబ్బులు తీసుకుని దుండగులు అక్కడి నుంచి పరారయ్యారు. బాధితులు కడియం పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీస్‌లు అప్రమత్తమై సమీపంలో సీసీ కేమేరాలను పరిశీలించారు. వివరాలు సేకరించారు.

ఆలయాలకు మహర్దశ

- నిర్విఘ్నంగా ధూపదీప నైవేద్య పథకం
- కనీస ఆదాయం లేని ఆలయాలకు ప్రతి నెలా రూ.5 వేలు చెల్లిస్తున్న ప్రభుత్వం



నిత్య పూజలందుకుంటున్న రంగంపేట దేవీ ఆలయం

రంగంపేట: కనీస ఆదాయం లేని ఆలయాల్లో నిత్య పూజలు జరిగేలా ప్రభుత్వం ధూపదీప నైవేద్య పథకాన్ని నిర్విఘ్నంగా కొనసాగిస్తుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా పథకాన్ని అమలు చేస్తూ గ్రామీణ ప్రాంతాల్లో ఆధ్యాత్మిక వైభవం తీసుకొస్తోంది. అనపర్తి నియోజకవర్గంలో 22 ఆలయాలకు ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరింది. ప్రతి నెలా రూ.5 వేలు వస్తుండడంతో ఆయా ఆలయాల్లో నిత్యం పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు...

చరిత్రలో నిలిచిపోయేలా సుదీర్ఘ పాదయాత్ర చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల కష్టాలను, బాధలను విన్నారు. ప్రతి గ్రామంలో నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. ఇందులో భాగంగానే పాదయాత్రలో చాలామంది అర్చకులు తమ సమస్యలను ఆయనకు చెప్పుకున్నారు. అధికారంలోకి రాగానే భరోసా కల్పిస్తానని జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. సీఎంగా బాధ్యతలు చేపట్టిన తరువాత ఇచ్చిన హామీ మేరకు ధూప దీప నైవేద్య పథకాన్ని ప్రవేశపెట్టి పక్కాగా అమలు చేస్తున్నారు. కనీస ఆదాయం లేని ఆలయాలను గుర్తించి ఆయా ఆలయాలకు ప్రతి నెలా రూ.5 వేలు చెల్లిస్తున్నారు. దాంట్లో అర్చకులకు రూ.3 వేలు, పూజా కార్యక్రమాలకు రూ.2 వేలుగా ఇస్తున్నారు. తద్వారా ఆయా ఆలయాల్లో రోజువారీ పూజలు జరుగుతున్నాయి. ప్రభుత్వ నిర్ణయంపై అర్చకులు, భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అర్చకులకు వరం



రంగంపేట గ్రామంలోని శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయ అర్చకుడిగా పనిచేస్తున్నాను. ధూప దీప నైవేద్య పథకానికి మా ఆలయం ఎంపికైంది. దీని ద్వారా నెలకు రూ.5 వేలు అందుతుంది. ఈ పథకం అర్చకులకు వరం లాంటిది.

– కోదూరి వీవీ సత్యనారాయణ, అర్చకుడు, రంగంపేట

సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీట



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలోని ప్రభుత్వం సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీట వేస్తుంది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆలయాల అభివృద్ధికి, అర్చకుల సంక్షేమానికి చర్యలు చేపట్టారు. అనపర్తి నియోజకవర్గంలో 22 ఆలయాలను ఎంపిక చేసి ప్రతి నెలా ఒక్కో ఆలయానికి రూ.5 వేలు చొప్పున అందిస్తున్నారు. దీనివల్ల దేవాలయాల్లో నిత్య పూజలు చేయడానికి అవకాశం కలుగుతుంది.

– పేపకాయల రాంబాబు, జెడ్పీటీసీ సభ్యుడు, రంగంపేట మండలం

నేడు మెగా వైద్య శిబిరం

రాజానగరం: తోకాడలో జక్కంపూడి రామ్మోహన రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం ఉచిత మెగా వైద్య శిబిరం జరుగనుంది. ఉదయం 9 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ వైద్య శిబిరంలో చిన్న పిల్లల నుండి వృద్ధుల వరకూ వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడే వారికి సుమారు 40 మంది ప్రముఖ వైద్యులు సేవలందించనున్నట్టు స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా తెలిపారు. ఈ శిబిరంలో అన్ని రకాల వ్యాధులకు పరీక్షలు చేయనున్నారని తెలిపారు. జీఎస్ఎల్, జూపిటర్ ఆస్పత్రుల సహకారంతో నిర్వహించే ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు జక్కంపూడి రాజా విజ్ఞప్తి చేశారు.

దరఖాస్తులకు 13 వరకూ గడువు

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీఈటీ (ఒకేషనల్) లెక్చరర్ పోస్టుకు దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 13 వరకు గడువు ఉందని సీతానగరం జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ దొరబాబు ఆదివారం తెలిపారు. సీఈటీ పోస్టుకు అర్హతగా బీటెక్ సివిల్ అయిన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తును ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అందించాలని, దానితోపాటు విద్యార్హత ధ్రువీకరణ పత్రాలను అందించాలన్నారు. ఇంటర్వ్యూ ఈనెల 16న జూనియర్ కళాశాలలో నిర్వహిస్తారని తెలిపారు.

నవరత్నాలతో పేదల జీవితాల్లో వెలుగులు



ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న బిక్కవోలు గ్రామస్తులు

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- ఆర్ఎస్‌పేట గడప గడపకూ కార్యక్రమంలో అడుగడుగునా జననీరాజనాలు

బిక్కవోలు: నవరత్న పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు నిండాయని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. బిక్కవోలు గ్రామంలోని తోటపేట, ఆర్ఎస్‌పేటల్లో ఆదివారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఎమ్మెల్యేకు అడుగడుగునా అపూర్వ ఆదరణ లభించింది. ఈ సందర్భంగా ఆయనను భారీ గజమాలతో సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల కారణంగా ఏ గడపకు వెళ్లినా ప్రజలు చిరునవ్వుతో తమను ఆహ్వానిస్తున్నారని చెప్పారు. అందరికీ మంచి చేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి రాబోయే ఎన్నికల్లోనూ ప్రజలు మద్దతు పలకాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ జంగావీర వెంకట సుబ్బారెడ్డి, ఆర్ఎస్‌పేట సర్పంచ్ దుర్గాభవాని, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ప్రచార కమిటీ చైర్మన్ రొంగల అప్పాజీ, జెసీఎస్ మండల కన్వీనర్ బొడ్డు ముత్యాలరావు, ఆర్ఎస్‌పేట మాజీ సర్పంచ్ యామన దుర్గారావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి, కొమరిపాలెం ఉపసర్పంచ్ కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, బాదిరెడ్డి భీమన్న, గువ్వల సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

గోకవరం: అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించాలని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు సూచించారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఆదివారం సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ సచివాలయ వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలు అందిస్తోందన్నారు. వలంటీర్లతో కలిసి సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించాలన్నారు. ఇంకా అర్హులు ఎవరైనా ఉంటే గుర్తించి వారికి పథకాలు అందించడంలో కీలకపాత్ర పోషించాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందించాల్సిన బాధ్యత సచివాలయ కన్వీనర్లు, గృహసారథులపై ఉందన్నారు. అనంతరం ఎమ్మెల్యే చంటిబాబును పార్టీ నాయకులు, గృహసారథులు, వలంటీర్లు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ సుంకర శ్రీవల్లి, జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ, జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, పార్టీ మండల కన్వీనర్ పాటి రాంబాబు, సొసైటీ చైర్మన్ గాజింగం సత్తిబాబు, మాజీ చైర్మన్ దాసరి తమ్మన్నదొర, నాయకులు సుంకర వీరబాబు, దాసరి సతీష్‌బాబు, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, ఎస్సీసెల్ జోన్ ఇన్‌చార్జి గుల్లా ఏడుకొండలు, టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్, ఎంపీడీఓ కె.పద్మజ్యోతి, తహసీల్దార్ సుగుణ, వివిధ శాఖల అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబును సత్కరించిన వలంటీర్లు, గృహసారథులు, పార్టీ నాయకులు

ఎమ్మెల్యే చంటిబాబుకు శుభాకాంక్షల వెల్లువ

గోకవరం: ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు జన్మదినాన్ని గోకవరంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. గోకవరం వచ్చిన ఎమ్మెల్యే చంటిబాబు స్థానిక దేవీచౌక్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భారీ ర్యాలీగా పంచాయతీ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. అక్కడ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేశారు. ఎమ్మెల్యేకు ఎంపీడీఓ కె.పద్మజ్యోతి, ఎంపీపీ సుంకర శ్రీవల్లి, జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ, సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, నాయకులు సుంకర వీరబాబు, కృష్ణునిపాలెం సర్పంచ్ రౌతు ఆదిలక్ష్మీ, నాయకులు రౌతు జోగేశ్వరరావు, పార్టీ మండల కన్వీనర్ పాటి రాంబాబు, తంటికొండ దేవస్థానం చైర్మన్ బద్దిరెడ్డి రాంబాబు (రెడ్డి), స్థానిక నాయకులు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

దేవీ నవరాత్రులకు రాట ముహూర్తం



దేవీ నవరాత్రులకు రాట ముహూర్తం చేస్తున్న పందలపాక గ్రామస్తులు

బిక్కవోలు: మండలంలోని పందలపాక వెలంపేట రామాలయం వద్ద శ్రీదేవీ నవరాత్రుల ఉత్సవాలకు సర్పంచ్ సబ్బారపు పద్మావతి, సూర్యనారాయణ దంపతులు రాట ముహూర్తం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఈ నెల 16 నుంచి 25 వరకూ దేవి నవరాత్రులు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో పంచాయతీ వార్డు సభ్యులు యామాల చిన్నమ్మ, మల్లిరెడ్డి వీర దుర్గాప్రసాద్, గుళ్లిపల్లి వెంకటరమణ, కమిటీ సభ్యులు మీసాల అనిల్ కుమార్, బొడ్డు లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

గోకవరం: ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు జన్మదినాన్ని పురస్కరించుకుని స్థానిక ఎస్‌వీఆర్ ఫంక్షన్ హాలులో ఎంపీపీ సుంకర శ్రీవల్లి ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఈఎన్‌టీ మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ముఖ్య అతిథిగా పాల్గొని వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. రాజమహేంద్రవరానికి చెందిన ఈఎన్‌టీ స్పెషలిస్ట్ డాక్టర్ సత్తి రవికాంత్‌రెడ్డి, ఇతర వైద్య సిబ్బంది సుమారు 300 మందికి వైద్య పరీక్షలు చేశారు. వీరిలో 20 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించి ఉచితంగా ఆపరేషన్లు చేసేందుకు చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సుంకర వీరబాబు, సుంకర వెంకటరమణ, దాసరి రమేష్, వరసాల ప్రసాద్, అధిక సంఖ్యలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.



గోకవరంలో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

బాపనమ్మను దర్శించిన ఎమ్మెల్యే



సీతపల్లిలో బాపనమ్మ వారిని దర్శించుకున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: అల్లూరి సీతారామరాజు జిల్లా సీతపల్లి బాపనమ్మ వారు మహిమాన్వితమైన అమ్మవారని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. ఆదివారం అమ్మవారికి కోరుకొండ మండలం శ్రీరంగపట్నానికి చెందిన భక్తులు నైవేద్యాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా కార్యవర్గ సభ్యులు సూరిశెట్టి కుటుంబరావు, నాయకులు మద్దాల రమణ, తదితరులు పాల్గొన్నారు.

'సురక్ష'లో 3,150 మందికి వైద్య సేవలు

సీతానగరం: మండలంలోని జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాల్లో 3,150 మందికి వైద్యసేవలు అందించామని పీహెచ్‌సీ డాక్టర్ ఏవీకే చైతన్య తెలిపారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మండల గ్రామాల్లో ఇప్పటి వరకూ జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో రోగులకు సేవలు అందించామన్నారు. చినకొండేపూడి-2లో 550 మంది, మునికూడలిలో 538 మందికి, చినకొండేపూడి-1లో 554 మందికి, బొబ్బిల్లంక-2లో 302 మందికి, కాటవరంలో 624 మందికి, రఘుదేవపురం-2లో 582 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశామన్నారు. ముగ్గళ్లలో జరగబోయే కార్యక్రమంలో నలుగురు వైద్యులు ఉండగా వీరిలో ఇద్దరు స్పెషలిస్టులు ఉంటారని తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, సచివాలయ సిబ్బంది 50 మంది వరకు సేవలందిస్తున్నారన్నారు.

'చంద్రయాన్-3 నమూనా'లో వెదుళ్లపల్లి విద్యార్థుల ప్రతిభ

సీతానగరం: జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరం ఆనం కళాకేంద్రంలో మూడు రోజుల పాటు నిర్వహించిన సైన్స్‌ఫేర్‌లో చంద్రయాన్-3 నమూనా ప్రయోగాత్మకంగా నిర్వహించినందుకు సీతానగరం మండల వెదుళ్లపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ జిల్లాలో ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. ఆదివారం రాజమహేంద్రవరం ఆనం కళాకేంద్రంలో వరల్డ్ స్పేస్ వీక్‌లో భాగంగా జిల్లా స్థాయి నమోన చంద్రయాన్-3 పోటీలను శ్రీహరికోటకు చెందిన సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో స్పేస్ సెంటర్ జనరల్ మేనేజర్ విజయ్‌కుమార్, సీనియర్ సైంటిస్ట్ సునీల్‌తోపాటుగా పదహారు మంది సైంటిస్టులు పాల్గొన్నారు. వీరు జిల్లాలో చంద్రయాన్-3 నమోన ప్రయోగాత్మక పోటీల్లో వెదుళ్లపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు చంద్రయాన్-3 నమూనాను ప్రయోగాత్మకంగా నిర్వహించారు. దీంతో జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచింది. 8వ తరగతి విద్యార్థినులు చంద్రిక, బండి చైతన్య జ్యోతి, పదో తరగతి విద్యార్థులు ఎస్.మానస, దుర్గాప్రసాద్, సీహెచ్ వరప్రసాద్, సాయి చరణ్, వెంకట దుర్గ, సాయి ప్రథమ స్థానం కైవసం చేసుకోగా ఇస్రో సైంటిస్టులు ప్రశంసాపత్రాలు అందించారు. జెడ్పీహెచ్ హైస్కూల్ సోషల్ ఉపాధ్యాయులు సతపతి శ్రీనివాస్, ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు గుబ్బల శ్రీనివాస్, వానపల్లి శ్రీనివాస్, ఝాన్సీ విలేకరులతో మాట్లాడుతూ జిల్లాస్థాయిలో 19 పాఠశాలల విద్యార్థులు పాల్గొనగా 8 పాఠశాలలు ఎంపికయ్యాయన్నారు. అందులో వెదుళ్లపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు ఉన్నారన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులను హెచ్‌ఎం ఎల్.సీతారత్నం అభినందించారు.



రాజమహేంద్రవరంలో విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న సైంటిస్టులు

సర్పంచ్ భర్త మృతి



శ్రీనివాస్ పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

రాజానగరం: ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు పాల్పడి, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కొండగుంటూరు సర్పంచ్ ఉర్రింకల నాగలక్ష్మి భర్త శ్రీనివాస్(57) శనివారం అర్ధరాత్రి మృతి చెందారు. పోస్టుమార్టమ్ అనంతరం స్వగ్రామంలోనే ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. ఎంతో సౌమ్యుడిగా పేరొందిన శ్రీనివాస్ వైఎస్సార్ సీపీలో క్రియాశీలక పాత్రను పోషించారు. ఎంపీటీసీ సభ్యుడిగా గెలుపొంది ప్రజల మన్నలు అందుకున్నారు. ఆర్థికపరమైన ఇబ్బందులతో కలత చెందిన ఆయన సెప్టెంబరు 26న రాజమహేంద్రవరంలో రోడ్డు కమ్ రైలు బ్రిడ్జి పైనుంచి గోదావరిలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడిన సంగతి తెలిసిందే. అయితే ఆ సమయంలో జాలర్లు చూడడంతో అతనిని కాపాడి ఆస్పత్రికి తరలించారు. దాదాపు కోమాలోకి వెళ్లిన అతనికి రాజమహేంద్రవరంలో వైద్యులు చికిత్స చేస్తూనే ఉన్నారు. మెరుగైన వైద్యం కోసం శనివారం జీఎస్ఎల్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెదవెంకన్న, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, మాజీ కన్వీనర్ మందారపు వీర్రాజు, రాజానగరం సర్పంచ్ కుందేటి ప్రసాద్, తదితర పార్టీ ప్రముఖులు శ్రీనివాస్ మృతదేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు.



ఉర్రింకల శ్రీనివాస్ (ఫైల్)

నేటి నుంచి జాతీయ తపాలా వారోత్సవాలు

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం తపాలా డివిజన్‌లో సోమవారం నుంచి 13వ తేదీ వరకూ జాతీయ తపాలా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు పోస్టల్ సూపరింటెండెంట్ పి.కోమల్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వారోత్సవాల్లో భాగంగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. 9న అన్ని తపాలా కార్యాలయాలలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాలు, 10న సామాన్య ప్రజలను ఆర్థిక చేరికలో భాగస్వామ్యం చేయడానికి »జనంలోకి మనం« అనే ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలకు పొదుపు పథకాలు, తపాలా జీవిత బీమా పాలసీలు, ఐపీపీబీ సేవలపై అవగాహన కల్పిస్తామన్నారు. 11న ఫిలాటలీ దినోత్సవంలో భాగంగా పాఠశాలల్లో డాయి అఖర్ ఉత్తరాల పోటీ, 12న తపాలా పార్సెల్ సేవల్లో వచ్చిన మార్పులపై అవగాహన కల్పిస్తామన్నారు. 13న వేమగిరి, కొంతమూరు, మునికొడవలి, కె.గంగవరం గ్రామాల్లో ఆధార్ నమోదుకు ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తామన్నారు.

యువతలో ప్రతిభను వెలికి తీయాలి



విద్యార్థులను అభినందిస్తున్న సుబ్బారావు

రాజమహేంద్రవరం సిటీ: యువతలో ప్రతిభను వెలికి తీసేందుకు రోటరీ క్లబ్ ఆఫ్ రాజమండ్రి నిరంతరం కృషి చేస్తుందని క్లబ్ అధ్యక్షులు తోట సుబ్బారావు పేర్కొన్నారు. ఆదివారం వై.జంక్షన్ ఆనం రోటరీ హాల్ లో యువజన ప్రతిభా పురస్కారాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నగరంలో 130 పాఠశాలు, కళాశాలలకు చెందిన 505 మంది విద్యార్థులకు పలు విభాగాల్లో పోటీలు నిర్వహించి, వారికి పురస్కారాలు అందించే కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు విజేతలకు బహుమతులు అందజేశారు. ఏటా సెప్టెంబర్‌లో పది రోజుల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించి ప్రతిభా పురస్కారాలు అందచేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పట్టపగలు వెంకట్రావు, క్లబ్ కార్యదర్శి నూనె సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

శాటిలైట్ సిటీ విద్యార్థులకు ఇస్రో ఆహ్వానం

- ప్రాజెక్టు ప్రదర్శనకు కితాబు
- బహుమతులు అందుకున్న జెడ్పీ హైస్కూలు విద్యార్థులు



బహుమతి అందుకుంటున్న శాటిలైట్ సిటీ విద్యార్థులు

రాజమహేంద్రవరం రూరల్: ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల్లో భాగంగా ఇస్రో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న శాటిలైట్‌సిటీ జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపి ఇస్రో శాస్త్ర వేత్తల మన్ననలు పొందారు. సైన్స్ ప్రాజెక్ట్ పోటీల్లో విద్యార్థులు ప్రదర్శించిన చంద్రయాన్-3 ప్రాజెక్ట్ బహుమతి పొందింది. ఇస్రో జనరల్ మేనేజర్ సైంటిస్ట్ విజయ్‌కుమార్ విద్యార్థులను పరీక్షించి, వారి ప్రాజెక్టులను విశ్లేషించి తగిన సూచనలు సలహాలు అందజేశారు. ప్రాజెక్టు రూపకల్పనలో విద్యార్థుల ప్రతిభను అభినందించారు. ఇస్రో డిప్యూటీ డైరెక్టర్ సునీల్ కుమార్ విద్యార్థులను అభినందించి మెమెంటో సర్టిఫికెట్ అందజేశారు. ఈ విద్యార్థులు ఇస్రోను ఎప్పుడైనా సందర్శించవచ్చని వారికి అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. ఇది అపూర్వ అవకాశం అని విద్యార్థులు వేణు మాధవి, షైనీ ,అవినాష్, గోపి, గైడ్ టీచర్ సుబ్బారావు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులను ప్రోత్సహించిన సర్వేశ్వర రావు, రాజారావు, ఉపాధ్యాయిని మేకా సుసత్య రేఖ, పాఠశాల ప్రధానోపాధ్యాయిని బి.రాజరాజేశ్వరిని అభినందించారు. శాటిలైట్ సిటీ హైస్కూల్ విద్యార్థులను, జిల్లా విద్యా శాఖాధికారి ఎస్.అబ్రహం, రాజమహేంద్రవరం డివిజన్ ఉప విద్యా శాఖాధికారి ఈరంకి నారాయణ, రూరల్ ఎంఈవోలు అయ్యంకి దుర్గా తులసీదాస్, చందుకుమార్‌లు అభినందించారు.

రేపు సహస్ర చండీ హోమం

సీటీఆర్ఐ: గురు నవరాత్రుల్లో భాగంగా మంగళవారం అమృతానందం రోజున సహస్ర చండీ పారాయణ, హోమం స్థానిక ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించనున్నట్టు తోట సుబ్బారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పూజ్య గురూజీ అమృతానంద నాథ సరస్వతి 2015 అక్టోబర్ 10న అమ్మవారిలో ఐక్యమయ్యారన్నారు. అక్టోబర్ 10కి ముందు 9 రోజుల నుంచి గురు నవరాత్రులుగా నిర్వహించి, పదిన అమృతానందం రోజుగా నిర్వహిస్తున్నామన్నారు. ఆ రోజున చండీ పారాయణ, హోమం నిర్వహిస్తున్నామన్నారు.